క్లుప్తంగా

శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు



పెనమలూరు:రోటరీ క్లబ్ శిక్షణ కార్యక్రమాలతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తుందని రోటరీ క్లబ్ విజయవాడ మిడ్ టౌన్ అధ్యక్షుడు ఎం.కృష్ణప్రభు తెలిపారు. యనమలకుదురులో శుక్రవారం వీఎల్ విజ్ఞాన కేంద్రంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్, ఐద్వా ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రోటరీక్లబ్ ఈ ఏడాది ఇప్పటి వరకు 500 మందికి కుట్టు శిక్షణ ఉచితంగా ఇచ్చామన్నారు. శిక్షణ పొందిన వారికి కుట్టు మిషన్‌లు ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కుట్టుతో పాటు ఎంబ్రాయడరీ, బ్యూటీషియన్, వివిధ రకాల శిక్షణ ఇచ్చి అండగా ఉంటున్నామని వివరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బాబు, సభ్యులు రామరాజు, పి.విజయ, ఐద్వా నాయకులు జయలక్ష్మి, వలీమా, ఫాతిమా, పలువురు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా ఇంటింటా సర్వే



ఉయ్యూరులో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ విజయ్‌కుమార్

ఉయ్యూరు: జగనన్న సురక్ష కార్యక్రమం వేగంగా పూర్తికావాలని ఆర్‌డీఓ విజయ్‌కుమార్ ఆదేశించారు. మున్సిపాలిటీలోని 1, 2, 3, 4 వార్డుల్లో జగనన్న సురక్ష సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సమగ్ర సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ ప్రభుత్వం పేర్కొన్న 11 రకాల సేవలు అందించాలని సూచించారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, డీఎల్‌డీఓ నాంచారరావు, తహసీల్దార్ మస్తాన్ పాల్గొన్నారు. ఆకునూరు, కడవకొల్లు గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వేపై ఎంపీడీఓ విమాదేవి, అధికారుల బృందం పరిశీలించింది.

విజయవాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం జూలై 1 నుంచి 29 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, ప్రత్యేక అధికారులు, అధికారులు, పార్టీ నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన తెలియజేశారు.

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభిస్తామని కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. శనివారం ఉదయం కానూరు 5 సచివాలయం, పోరంకి 1వ సచివాలయంలో జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహిస్తామన్నారు.

పెనమలూరు: చోడవరం గ్రామంలో నేడు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభిస్తున్నామని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. ఉదయం 8 ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఇప్పటికే ఇంటింటి సర్వే చేసి ప్రజల సమస్యలు తెలుసుకుని నమోదు చేశామన్నారు. వారికి టోకెన్‌లు కూడా ఇచ్చామన్నారు.



ఉప్పలూరు సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్

కంకిపాడు: జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారమవుతాయని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇంటింటి సర్వే ద్వారా గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జగనన్న సురక్ష మార్గదర్శకాలను ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి వివరించారు. తహసీల్దార్ ప్రసాద్, సర్పంచ్ లాం సోనియా, ఈఓఆర్‌డీ మైథిలి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము రూ.4.96 కోట్లు విడుదల

పెనమలూరు: మండలం, తాడిగడప మున్సిపాలిటీలో ఉన్న పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.4.96 కోట్లు పింఛన్ సొమ్ము విడుదల చేసింది. పెనమలూరు మండలంలో 11 సచివాలయాల పరిధిలో 5525 మంది లబ్ధిదారులకు రూ. 1,52,80,000, తాడిగడప మున్సిపాలిటీలో 19 సచివాలయాల్లో 12,308 మందికి రూ.3,43,76,250 సొమ్ము మంజూరు చేశారు. మొత్తం 17,833 మందికి రూ.4,96,56, 250 ప్రభుత్వం విడుదల చేసింది. జూలై 1వ తేదీన సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఇస్మాయిల్



ఉయ్యూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు అధ్యక్షుడిగా ఎండీ ఇస్మాయిల్ ఎన్నికయ్యారు. 2023-24కి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. స్థానిక లయన్స్‌క్లబ్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. లయన్స్ ప్రతినిధి నూకల వెంకట సాంబశివరావు పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో క్లబ్ అధ్యక్షుడిగా ఎండీ ఇస్మాయిల్, కార్యదర్శిగా నల్లా శ్రీనివాసరావు, కోశాధికారిగా ఊర కిషోర్‌తో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ జోనల్ చైర్‌పర్సన్‌గా ఎస్.రామసత్యకిషోర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని క్లబ్ ప్రతినిధులు హనుమంతరావు, డాక్టర్ సుధాకర్, గణేష్, రాంబాబు, పాగిరి రాము అభినందించారు.

నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

డీఐజీ అశోక్‌కుమార్



గన్నవరం: నేరాల నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ పి.జాషువాతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఐజీకి డీఎస్పీ జయసూర్య, సీఐ పి.కనకరావు, పలువురు ఎస్‌ఐలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. పోలీస్ సిబ్బంది ఆయనకు గౌరవ వందనం పలికారు. అనంతరం డీఐజీ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. స్టేషన్ రికార్డులను పరిశీలించడంతో పాటు అధికారులు, సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. అనంతరం రాయ్‌నగర్‌లో ఉన్న డీఎస్పీ కార్యాలయాన్ని డీఐజీ సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైమ్ రేటు తక్కువగానే ఉందని, శాంతి భద్రతల పరిరక్షణలో అధికారులు సమర్థంగానే పనిచేస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఇక్కడ ఉండడం వల్ల వీవీఐపీల రాకపోకల సమయంలో ఎక్కువ మంది అధికారులు, సిబ్బందిని భద్రత విధుల నిమిత్తం వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఖాళీగా ఉన్న పోలీస్ క్వార్టర్స్ స్థలాన్ని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ద్వారా పోలీస్ శాఖకు నిధులు వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఉంగుటూరు: పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువులకు దూరం కారాదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం ద్వారా నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్నారని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం అమ్మఒడి లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 4256 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.5.53 కోట్లు నాల్గో విడత అమ్మఒడి డబ్బులు జమచేశారని వివరించారు. అనంతరం అమ్మఒడి లబ్ధిదారులు సీఎం జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈవోఆర్‌డీ బాషా పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కంకిపాడు: తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవటం హర్షణీయమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. ఉప్పలూరు గ్రామంలోని నిమ్మతోట ప్రాంతంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పంచాయతీ పాలక వర్గం గుర్తించింది. పంచాయతీ సాధారణ నిధులతో నూతనంగా బోరు ఏర్పాటుచేసింది. బోరును ఎంపీపీ రాజ్యలక్ష్మి ప్రారంభించారు. సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు చేపడుతుందన్నారు. సర్పంచ్ సోనియా, ఈఓ శ్రీనివాసరావు, లాం సురేష్, ఎస్.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: నేడు యనమలకుదురులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా గ్రామంలో లాకులు, డొంకరోడ్డు, ఇందిరానగర్ 1, 2, లిబ్రాకాలనీ, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గ్రామస్తులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై కేసు

పెనమలూరు: భార్యాభర్తలను బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం ... గోసాల చింతలకట్ట ప్రాంతంలో మసనం స్వాతి, ఆమె భర్త శ్రీధర్, ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. అయితే వారి కుమార్తె (16)ను మైలవరం ప్రాంతం మరుసుమిల్లి గ్రామానికి చెందిన వరసకు బావ డి. రాముకు ఇచ్చి వివాహం చేయాలని గతంలో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా రాము వద్ద రూ.1.48 లక్షలు స్వాతి ఆమె భర్త శ్రీధర్ తీసుకున్నారు. అయితే కుమార్తె మైనర్ కావటంతో పెళ్లి వాయిదా వేశారు. దీంతో రాము తనకు పెళ్లి చేయాలని లేని పక్షంలో తీసుకున్న సొమ్ము ఇవ్వాలని నిడమానూరుకు చెందిన సాయిబాబుతో కలిసి వారిని బెదిరించారు. ఈ ఘటన పై స్వాతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

లక్ష్మీ హర్షితకు ఇస్కాన్ పురస్కారం



గన్నవరంరూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల విద్యార్థినికి ఇస్కాన్ పురస్కారం లభించింది. జూన్ 25వ తేదీన విజయవాడ ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కల్చరల్ ఫెస్టివల్ రథ్‌ఫెస్ట్ కార్యక్రమంలో కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న దంత వైద్య విద్యార్థిని జి.లక్ష్మీ హర్షిత క్లాసికల్ మ్యూజిక్ కాంపిటీషన్‌లో ఓకల్ ఇన్ సీనియర్ కేటగిరిలో ప్రథమ బహుమతి సాధించింది. లక్ష్మీ హర్షితను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, డాక్టర్ అజయ్ బెనర్జీ, డాక్టర్ నాయుడు, డాక్టర్ రవిచంద్ర అభినందించారు.

వృత్తివిద్యా రంగంలో ఉద్యోగావకాశాలు మెండు

గన్నవరం: వృత్తి విద్యారంగంలో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని ఎన్టీటీఎఫ్ కళాశాల ప్రిన్సిపాల్ మహీధర్ అన్నారు. మండలంలోని దావాజిగూడెంలో ఉన్న ఎన్టీటీఎఫ్ కళాశాలలో మూడేళ్ల డిప్లొమో ఇన్ టూల్ ఇంజినీరింగ్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వృత్తి విద్యలో శిక్షణ పొందడం ద్వారా తక్కువ కాల వ్యవధిలోనే ఉద్యోగ జీవితంలో స్థిరపడవచ్చని తెలిపారు. ఆత్కూరు హెచ్‌ఎం కేవీబీకే సుధాకర్, మేనేజర్లు పద్మజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధికి తోడ్పాటునందించాలి



దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో శుక్రవారం వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళల జీవనోపాధికి ఆర్థిక తోడ్పాటును అందించారు. చిరు వ్యాపారాలు చేసుకునేందుకుగాను మొత్తం 48 మంది మహిళలకు రూ.9.52 లక్షల నగదును అందజేశారు. మగ్గం, ఎంబ్రాయిడరీ, టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. హెచ్‌సీఎల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ తమ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాక్సెస్ టు జస్టిస్ కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుమలత, ప్రోగ్రాం మేనేజర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల వైద్యానికి పుట్టగుంట ఆర్థిక సాయం



హనుమాన్‌జంక్షన్‌రూరల్: అరుదైన వ్యాధులతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ అండగా నిల్చారు. బాపులపాడు గ్రామ పంచాయతీలో వేతన కార్యదర్శిగా పని చేస్తున్న పోలిమెట్ల నాగరాజుకి ముగ్గురు కుమారులు. వీరిలో చిన్న కుమారుడు రోషన్‌కు పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, రెండో కుమారుడు అభిషేక్‌కు మెదడులో నీరు చేరటంతో అనారోగ్యానికి గురయ్యాడు. రోషన్‌కు అత్యవసరంగా గుండె ఆపరేషన్ చేయించాల్సి రావటంతో పుట్టగుంట సతీష్‌కుమార్‌ను ఆశ్రయించారు. తక్షణమే స్పందించిన ఆయన రోషన్ శస్త్రచికిత్స నిమిత్తం రూ.25 వేలు ఆర్థికసాయాన్ని అందించటంతో పాటుగా రెండో కుమారుడు అభిషేక్‌కు విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో పూర్తి ఖర్చులు తానే భరించి మెదడు ఆపరేషన్ చేయిస్తామని భరోసా ఇచ్చారు.నాగరాజు దంపతులు సతీష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగ విరమణ చేసిన డీఈకి సత్కారం



గన్నవరం: ఉద్యోగ విరమణ చేసిన గృహ నిర్మాణ శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శింగలూరి వెంకటేశ్వరరావుకు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును ఎంపీడీవో సత్యకుమార్, గృహ నిర్మాణ శాఖ ఏఈల రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరావు సత్కరించారు. ఏఈలు సాయి, సురేష్, సుబ్బారావు, జిలాని, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.